# నాకు నచ్చిన నా కథ



**పులికంటి క్రిష్ణారెడ్డి**

మనిషి మనిషికి ఒక్క ఆశయం ఉంటుంది. పరిస్థితులు అనుకూలించినపుడు ఆశయం సిద్ధిస్తుంది. లేనపుడు ఆశయం ఆశయంగానే మిగిలిపోతుంది. దీనితో రాజీపడలేని మనిషి ఆశయసిద్ధికై పోరాడుతాడు. ఈ పోరాటాన్ని చూచి లోకం నవ్వుతుంది. దాని తీరే అంత!

మంచికిపోతే చెడు ఎదురయ్యే అలాంటి ఒక పాత్రను సృష్టించాలని చేసిన ప్రయత్న ఫలితమే – ముత్యాలు. ముత్యాలు దౌర్భాగ్యానికి మూలం– ఏది? సామాజిక వ్యవస్థనా? విధియా? లేక వ్యక్తిత్వమా?– బిచ్చగాండ్ర సమస్యను గురించి ఆలోచించే లోకం– ప్రతి బిచ్చగాడి వెనుకా ఒక చరిత్ర ఉందని మరచిపోతుంది. అందుకే కసిరి కొట్టడమో, కన్నెఱ్ఱ చేయడమో చేస్తుంది.

నాకు నచ్చిన పాత్ర ముత్యాలు నా అనుభవంనుండి పుట్టింది. ఈ కథ "భారతి"లో 1964 లో వచ్చింది. అందుకే ఇది నాకు నచ్చిన కథ అయింది. మీకు నచ్చితే– అంతకంటే రచయిత కోరుకునే దేమీ ఉండదు.

## లోకం నవ్వింది!

బుట్టలో పాములా స్తబ్దంగా ఉంది ప్రకృతి. ఉక్కపోస్తూ ఉంది జగతి.

కర్మసాక్షి కన్నెఱ్ఱచేస్తే కలువలు మూతి ముడిచి, కెందామరలు విచ్చి వికసించాయి. గుక్కెడు నీళ్ళకోసం కొలనుగట్టు మీదికి వచ్చాడు ముత్యాలు.

అమడ దూరానికి పైగా కాలికి కాలు కొట్టుకుంటూ నడవడం.... కడుపులో తడి లేకపోవడం....కడిగి తోసినట్లున్న ఆకాశం మిడిసిపడుతూ ఉండడం- నిండు గుంటను చూసేసరికి ముత్యాలు పిడచగట్టిన పెదువులపై పోయిన ప్రాణం లేచివచ్చిన సంతృప్తి తొణికిసలాడింది. దుమ్ము నిండిన మడమలు నీళ్లలో మునిగాయి. దోసెడు నీళ్లకోసం రెండుచేతులు కలిపి నీటిపైకి వంగాడు. నీళ్లను అందుకోబోయి అలానే నిలబడిపోయాడు !

తీసి కాస్తున్న ఎండ.... ఆకు అల్లాడకపోయేసరికి అలలు సన్నగిల్లి నిర్మలంగా ఉన్న నీరు.... ఆ నీటి వెనుక కాలప్రవాహంలో ఉర్లిపడి, కాస్త దూరం దొర్లి, అక్కడ వో వెంట్రుకవాసి ఆధారానికి తగులుకొని కొట్టు మిట్టాడి నిలబడిన వో దీనాకృతి ! ఎండి నెర్రెలు చీలిన పులకమడిలో చచ్చీ చావక నిలబడిన నాచులా తలమీద తేసిపోయిన వెంట్రుకలు.... పేదరికం లేకుండా పెరిగిన గడ్డం.... పందెం వేసుకొని పీక్కుపోయిన కళ్లు, బుగ్గలు- అబ్బ ! ఎంత వికృతంగా ఉంది.

తన రూపం తనకే అసహ్యమనిపించేసరికి చూచి సహించలేక గబగబ ఆ రూపాన్ని చెరపివేశాడు ముత్యాలు. రెండు దోసిళ్ల నీళ్లతో ప్రాణం కుదుట బడింది. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఏవేవో అభిప్రాయాలకు, అభిరుచులకూ అలవాటుపడ్డ రెండు జీవితాలను కలిపేది పెండ్లిపీట అయితే- అలాంటి- రెండు పట్టణాలను కలిపే రాచబాట అది. అంగిట బెల్లముంచుకొన్నవారు, నొసటితో వెక్కిరించగల నేర్పరులూ, తడిగుడ్డతో గొంతు కోయగల నిపుణులూ, వేడినీళ్లతో కొంపలు కాల్చగల కోవిదులూ.... స్వార్థులూ.... నిస్వార్థులూ.... అపర చాణక్యుల మధ్య నివసిస్తూ, అందరికీ అనుగుణంగా జీవితాన్ని బహు చాకచక్యంగా ముందుకు లాక్కునిపోగల వో మానవుడి లాంటి ఆ బాట మిట్ట పల్లాలను, వంక వాగులను, కొండ లోయలను అధిగమిస్తూ వచ్చి అక్కడ వో అర్ధవృత్తాకారాన్ని రూపొందించుకొంది. ఒక్క దెబ్బలో రెండు పిట్టలు కొట్ట గల ప్రజ్ఞాశాలుడైన మానవుడు ఆ అర్ధవృత్తాకృతిలో కాస్త మట్టిని తీసి అవతల పోసి, ఆ బాట మలుపు వెంబడి చింతచెట్లు, వెలగచెట్లు నాటాడు. నిజము సంగతి ఏమో కానీ, నీరు మాత్రం ఆ పల్లాన్ని గుర్తించి నిలకడగా నిలబడి పోతే అది మంచినీళ్లగుంట అయింది. ఆ కట్టపై నాటిన చెట్లు నీటి పట్టుతో బాగా ఎదిగి, శాఖోపశాఖలై వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు కూడుపెట్టే తనయుల్లా పెంచిన మానవులకు చల్లని నీడ నిస్తున్నాయి. చేసిన తప్పులకు

ప్రాయశ్చిత్తంగానో, లేదు, రాబోయే జన్మలో మరింత మంచి స్థితిని పొందాలనో వాంఛించిన మానవుడు ఆ వెలగచెట్టుక్రింద వో బండను తిన్నెలా అమర్చినాడు. ఆ బండమీద కూర్చుని నీరసించిన కట్టెలాంటి శరీరాన్ని వెలగచెట్టుకు చేరగిలవేశాడు ముత్యాలు.

కాసేపు వూపిరి బిగపట్టి లోకాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి ఆ మీదట 'పోనీలే!' అని దయతలచి ఒక్క శ్వాసను వదిలాడో సమీరుడు- లేదు ఈలాంటి అభాగ్యులను చూచి బాధగా నిట్టూర్చాదో తెలియదు కాని, ఎంతలో ఎంత మార్పు! -మెల్లగా చెట్లు కదిలాయి. అంతకంతె మెల్లగా కదలుతూ ఆకులు వింజామరలు వీచాయి. ఆ గాలి మంచినీటి మీదుగా వస్తూ, వస్తూ చల్లదనంతోపాటు మరింత సౌరభాన్ని వారుకొని హృదయంగమంగా వీస్తూ ఉంది. తల్లి ప్రేమలాంటి చల్లని నీడ.... అంతకంతె చల్లని గాలి- నిద్ర చోటెరుగ లేదు. ముత్యాలు మాగన్నుగా కన్ను మూశాడు. "గానుగెద్దులా ఉన్నావ్!- కళ్లు కనబడ్డంలేదూ?! వూళ్లోకి పోరా అంతా తిండి దొరుకుతుంది!"

నీటికోసమో, చెట్టునీడ కోసమో నిలబడిన బాటసారులు కనీసం 'ఆకు వక్క అయినా కొనకపోరులే!' అన్న తలంపుతో వెలగచెట్టుకు రెండుబారల దూరంలో పూరిగుడిసెలో చిల్లరంగడి జరుపుతున్న అలిమేలు కసిరింది. అదిరిపడి కళ్లు తెరిచాడు ముత్యాలు! దిగులుగా మనసులో గుబుగుబులుగా గుంట కట్ట దిగిపోతున్నాడొక పదేండ్ల పిల్లవాడు! ఈనెపుల్లను మరిపించే చిన్నవాడు!!- కాయకష్టంచేసి బ్రదికేవాళ్ల కండ్ల కతడొక సోమరి. కలిగినవాళ్ల దృష్టి కతడొక ముష్టి వెధవ: కాదు, గాదుగెద్దు!!

"అసలు మానవుడు ఆత్మాభిమానము, సిగ్గు, బిడియము- అదిగాగం, మానవత్వానికి మెరుగులు దిద్దగల సుగుణరాశిని వదలి, సాటి మానవుని ముందు 'దేహి!' అని ఎందుకు చెయి చాపుతాడు?- అది పుట్టుకతో వచ్చిన గుణమా? లేదు పరిస్థితుల ప్రోద్బలమా?" ఈ భావన మనసులో మెదిలిందేమో, బాగా పెరిగిన గడ్డాన్ని వ్రేళ్లతో రాచి, తడిమిచూచి పెదవి విరిచాడు ముత్యాలు. అంగడికి బేరం వచ్చిందేమో, అంతలోనే ఆప్యాయతను ఒలకబోస్తూంది అలిమేలు. అల్లంతదూరంలో ఎర్రని ఎండలో ఎద్దులు లాగలేక లాగుతూంటే 'కిఱ్ఱు' మని శబ్దంచేస్తూ ఉంది నూనె గానుగ. ముత్యాలు మనస్సు ప్రస్తుతం నుండి ఒక్కసారిగ ఇరవై సంవత్సరాల వెనక్కు తిరిగింది.

అప్పుడు తన వయస్సు సరిగ్గా అంతే. ఆ వెళ్లిపోయిన పిల్లవాని

కున్నంతే ఉంటుంది. ఆ వయసులోనే తాను లోకంమీద పడ్డాడు. ఆకలి బాధకు తట్టుకోలేక, ఆర్జించే మార్గం గోచరించక అథవా గోచరించినా అందు బాటులేక, పిడికెడు కూటికి దోసెడు తిట్లు తిన్నాడు. చాలసార్లు చద్దామని ప్రయ త్నించాడు. తానేమో ఎలుగెత్తి ఆహ్వానించినా తనవైపు చూడనైనా చూడ లేదు చావు. అదేమి చిత్రమో, కావాలని కోరుకొని, అహరహము కలలు కని, అందుకై పరితపిస్తే అందుబాటు కావు కొన్ని; వద్దనుకొంటే కూడ అనుకో కుండా వచ్చి నెత్తిన పడతాయి కొన్ని;; లేకపోతే గీచిన గీతలా సవ్యంగా సాగిపోవలసిన బ్రతుకుబాట, వంకర టింకరలుగ చేసి వదలిందా ఒక్కమాట; ఆ ఒక్కమాటే తన లేత హృదయాన్ని కోతలా బాధపెట్టింది. యమపాశంలా గొంతుకు తగులుకొని బరబర లాగి విసరి పారవేస్తే, కొండ కొమ్ముమీద పడ్డ రాయిలా తన బ్రతుకీనాడు....; ఆ రోజు తాను ఇంట్లోనే కూర్చుని అయ్యవారు చెప్పిన ఇంటి పాఠాన్ని వ్రాసుకొని ఉంటే ఇంత జరిగేది కాదు. వ్రాయాలనే అనుకొన్నాడు. అనుకోవడము, ఆచరణ ఏకమై, అనుకొన్నట్లుగ జరిగి పోతూంటే, ప్రగతికామియైన మానవుని పరిస్థితి ఎలా ఉంటుందో మరి?; పలకా పుస్తకాలు తెచ్చి ముందర వేసుకున్నాడు. పుటకమీద బుడ్డీ దీపం నిశ్చలంగా వెలుగుతూ ఉంది. పుస్తకం విప్పబోయాడు. అంతలోనే పాట వినిపించింది. మనస్సు పాఠాల వైపునుండి పాటవైపు మొగ్గింది. పాట వినిపిస్తున్నవైపు దృష్టి మరలడంతో బయటితట్టు చూశాడు. దాదాపు జామురాత్రి కావస్తూంది. పువ్వు పూసినట్లు పున్నమినాటి పిండువెన్నెల, చుట్టూరా పచ్చని పైరుచేలు. ఆ చేలు ఉండుండి పలకరించే పచ్చిటిజల్లుల చల్లని గాడ్పులు. ఆ గాలి మోసు కొస్తున్న పాట జానపద గేయాల్లో వజ్రాల మూట.

"నడిలో గుమ్మడి— ఇంటెనక సిక్కుడు
పోదాని కల్లకంత— పాయరా తీగె
నేనేమి రంకాతి?
నా రంకయిన తెలపరా? రాజాతి మగడా?
నేనేమి రంకాతి??"

నిమ్మగా వినిపిస్తూంది పాట. తనకు తెలియకనే తన కాలు లయ నందుకుంది. ఒక్క అడుగులో ఎగిరి నడివీధిలో పడ్డాడు.

[illegible] మో త్రిపైకి ఎగకట్టి కో[illegible] లికి జుట్లు, సుంగువిడిచి తలకు పాగ చుట్టి, జోడు కోలాటపుల్లలు చేతబట్టి 'కోపు' పట్టాను కుర్రకారు.

పాటపాటకు కోలాటపుల్లల లయ. లయకు తగ్గ అడుగు దుమ్ము లేచి పోతూంటే, ఆ ఊళ్లోవాళ్లంతా రచ్చబండమీద, ఇంటిముందు అరుగులమీద కూర్చుని చెవులు రిక్కించి వింటున్నారు. ముత్యాలు హృదయం గంతులు వేసింది. ఒక జత కోలాటపుల్లలు అందుకొని తాను జట్టులో కలిసిపోయాడు. పాట తారస్థాయి నందుకొంది; 'అయ్.... హా! అయ్.... హా!' అని అడుగు పాటకు తోడు కలిసింది. ముసలి ముతక 'బలెబలె' అని మురిసి, అనుభవాలను నెమరువేసుకొంటూ ప్రోత్సహిస్తున్నారు. లోతుబావుల్లో నీళ్లు తోడి వెతలుబడ్డ రైతాంగము వేసవి వెన్నెల్లో, ఆనందపు వెల్లువల్లో తేలి, కాస్త సేదదీర్చుకొంటున్నారు. 'ధూత్' అన్నాడు ఉన్నట్లుండి రెడ్డి కొడుకు. కడివెడు పాలల్లో ఒక కల్లు ఉప్పులా పరిణమించిందామాట. ఆ మాటతో కోలాట లయ తప్పి ఆగిపోవడం, తన చెంప 'చెళ్లు' మనడం త్రుటిలో జరిగిపోయాయి. తానేమీ గ్రహించలేకుండా బిత్తరపడి తెల్లమొహం వేస్తే తన యిష్టమొచ్చినట్లు నోరు పారవేసుకొంటున్నాడు రెడ్డి కొడుకు. ఎవరో వో నడికారాయన "ఏం జరిగింది నాయనా!" అంటూ ఆతురతగా ఆ జనంలోనుండి లేచివచ్చాడు. "చూడండి! గాడిద!!— చేతకాకపోతే వూరకుండాలి! ఎవరు పిలిచారీ వెధవను తాంబూలం పెట్టి?.... చేతికేసి కొట్టాడు." కొరకొర చూస్తూ, కోపాన్ని కక్కుతూ చేతి వ్రేళ్లు నొక్కుకున్నాడు రెడ్డి కొడుకు. దెబ్బ తగిలిన చిహ్నాలేమీ కనుపించలే దక్కడ.

"పోనీలే నాయనా! అబ్బ-అమ్మకు పుట్టిన బిడ్డయితే అదుపు ఆజ్ఞలుండి ఏడుస్తాయి. ఈ అతిమాత్ర ఎక్కడా యింతే" అని సర్దుబాటు చేశాడు మధ్యవర్తిగా ఆ నడికారాయన

ముత్యాలు గుండెల్లో ముండ్లు గ్రుచ్చుకొన్నాయి. సాధారణంగా దారి నడిచేటప్పుడు తగిలే ముండ్లయితే కాసేపు ఏడిపించి విడిచిపెట్టుతాయి. కాని, ఇవి సూటిగా గుండెల్లో గ్రుచ్చుకొన్న ముండ్లు!

ముత్యాలు కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. గుండె బరువుతో, నిండు వెరపుతో అక్కడనుండి చల్లగా జారుకొన్న వో స్త్రీ ఆకారాన్ని ఎవ్వరూ గమనించలేదు. మరొక్క క్షణం ముత్యాలు అక్కడ నిలబడలేకపోయాడు. మెల్లగా ముందుకు సాగాడు. రచ్చబండ దూరమవుతున్నకొద్దీ పిచ్చి నవ్వులు మాత్రం ఘోరంగా, క్రూరంగా వెన్నాడుతున్నాయి బాధిస్తూ. ఆ బాధతోపాటు ఆలోచనలు.

అవును! తాను ఈ విషయాన్ని గురించి ఎన్నడూ ఆలోచించలేదు.


అసలు ఆలోచించే అవసరమే లేకపోయింది. ఏదో కూలినాలి చేసి అమ్మ అంత కూడు ముద్దుమురిపాలతో రంగరించి తినిపించడం, తాను బడికి వెళ్లడంగా దశ వర్షాలు మహార్దశను చవిచూశాయి. కానీ, ఈనాడు నలుగురిలో తల ఎత్తలేని అవమానం జరిగింది. దీని కంతకూ కారణం అమ్మ!— 'ఈవేళ ఏమైనా సరే! అమ్మను నిలదీసి అడగాలి!' అనుకొనేసరికి తన కాళ్లు కొత్త వేగాన్ని పుంజుకొన్నాయి. ఇంట్లో అడుగుపెట్టాడు. పాత పూరిల్లు పరిగపోద లాంటి పైకప్పు నుండి వానజల్లు, వెలుగు వెన్నెలలు నిష్పాక్షికంగా పారే యిల్లు నేలంతా వెన్నెల పొడలు మింటివి చుక్కల్లా మినకరిస్తున్న యిల్లు పూరికి వో మూలగా, మూలుగుతూంది ఒంటిగా. అందులో పుటికమీద బుడ్డి దీపం గాలిధాటికి రెపరెపలాడుతూ ఉంది. ఎదురైన అమ్మ మొగం అంతకంటె 'వెలవెల'పోతూ ఉంది!

"ఏవి నాయనా? పలకా పుస్తకాలు ఎక్కడివక్కడ పారేసి, ఆ పుటిక మీది దీపం కూడా గూట్లో పెట్టకుండా పరుగెత్తావే? ఇప్పుడే ఇలాగయితే ఎలాగయ్యా?" గుండెను నమిలే బాధకు ముసుగువేయాలని నసిగింది అమ్మ. ఆ మాటలు తన చెవుల్లో పడలేదు సరిగదా, చెవుల్లో పడిన మాటలు మాత్రం తూట్లు పొడుస్తున్నాయి. తన నిర్ణయం మారలేదు.

"చెప్పమ్మా? మా నాన్న ఎవరో చెప్పు-"

చూపులు సూటిగా ఉన్నాయి. మాటలు ఘాటుగా ఉన్నాయి. మేక కంట పడ్డ లేత ఆకులా అల్లాడిపోయింది ఆమె హృదయం.

"నిజమే! తాను ఆయనచేత వంచింపబడింది. తన జన్మకారకులెవరో తెలియని శైశవదశనుండి పంచన చేర్చి పెంచినారు. తనకు వయసు, వయసుతోపాటు అందం, అన్నిటికీ మించి అందుబాటు, గ్రహపాటుతో గృహిణి చెల్లుబాటు- జరిగేసరికి వినియోగించుకున్నారు 'పెండ్లి' సాకుతో. వయస్సులు పోల్చిచూస్తే తండ్రి బిడ్డల తారతమ్యాని కేమాత్రం తీసిపోక పోయినా, కృతజ్ఞత అనేది ఈ లోకంలో ఉంటే అది మొదట తన గుండెల్లోనే పుట్టినట్టు భావించి అంగీకరించింది వివాహానికి, అంతరాత్మ అంగీకరించిక పోయినా. తీరా తన కడుపు పండబోతున్న సంగతి తెలిసివచ్చేసరికి ఆయనకు తన అంతస్థు కులమూ, గౌరవము అన్నీ తెలిసివచ్చాయి. పోనీ, అంతటితో వదిలిఉండినా బాగుండేది. పలుకుబడితో పదిమందిని పంచన చేర్చి తమ్ము వాళ్ల ముందు నిలబెట్టాడు ముద్దాయిలా. వారు చేరిన కారణం, వినబోయే మాటలతీరూ




వూహించుకోనేసరికి తల కొట్టేసినట్లవుతూఉంది. అయినా నిలబడలేకపోతే విధిలేదు. చూస్తూ చూస్తూ ఉండగానే ఆయన గొంతు బాగా గద్గదమైపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. ఎవరినీ ఉద్దేశించకుండా, దీర్ఘ స్వగతంలా, వూర్ధ్వ దృష్టితో, తనలో తాను గొణుక్కొన్నాడు "చిన్నప్పటినుండి పెంచి పెద్ద చేశాను. కడుపున పుట్టిన బిడ్డకంటె ఎక్కువగా ప్రేమించాను. అంతకంటె ఎక్కువగా ఆదరించాను. కాలం కలసివస్తే ఎవడి చేతిలోనైనా పెడదామను కొంటే " అపై మాటలు పెగలనట్లుగ అసలే గద్గదమైపోయిన గొంతు బాగా పూడుకుపోయింది. ఆ మాటలు చెవిని పడుతూఉంటే, ఎదమీద ఎవరో సమ్మెటతో బాదినట్లుంది. విని విభాయించుకోలేక ఒక్క విసురులో లోనికెళ్లింది. వాళ్ల మొగం చూడలేక కుంచించుకుపోయిన మనస్సు మాత్రం మళ్లీ వాళ్ల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది

పాపం! కాస్త తమాయించుకొని మరలా ఆరంభించాడు ఆ పెద్దమనిషి. "అనకూడదు కానీ- అనరాని, వినరాని పనే చేసింది బుద్ధిలేని గాడిద- తాను చెయ్యరాని పనిచేసి నాచేత చెయ్యరాని !- రామ ! రామ !! ఎలా భరించాలీ బాధను ?" -వాలిపోయిన తలను రెండు చేతులు వొదివి పట్టుకొని సేద దేర్చితే, వేడి నిట్టూర్పులు మాత్రం కట్టలు త్రెంచుకొని బయటపడ్డాయి.

ఆ వేదీ ధాటికి కుప్పగ కూలిపోయింది తాను !

"ఎందుకు బావా ? దీని కింతగా వగచడం ? నాలుగు దవ్వి మెడబట్టి అవతలకి గెంటితే సరి ! నీ వెర్రిగానీ ! హ్హహ్హహ్హ ! కుక్క తోకకు డబ్బులు కట్టాలనుకున్నావ్ " ఏహ్యభావంతో బాహటమైన బుద్ధిమంతుని మాటలు !

కన్పించిన మాట కలవారినోట కఠోరసత్యమై నాటకం బాగా రక్తి కట్టింది. తన బ్రతుకు నవివీధిలో కడిగిపోసినట్లయింది. ఆత్మహత్యా పాపానికి భయపడి, కడుపు తీసితో వూరుకాని వూరు చేరి వో కొడుకును కనుక్కొంది. ఆ కొడుకు ఈనాడు ఎదిగి, ఎదుట నిలబడి, నిలదీసి అడుగుతున్నాడు. "ఎవరు తన తండ్రి !" అని

"ఏమని చెప్పడం ?"

"ఏమో, ఎందుకు చెబుతావ్ ? జరిగిందేదో చెప్పు !"

"చెబితే నమ్ముతాడా "

"నమ్మించాలి మరి !"

"అంత అవసర మేమొచ్చింది?"

"అవసరముందేగా అడుగుతూండడం !"

"అందరి అవసరాలకు నేను బాధ్యురాలనా ?"

"అందరి సంగతి అటుంచు. వాడు నీ బిడ్డ !!"

"అందుకేగా ఇంకా బ్రతికిఉన్నాను."

"నీ బ్రతుకు వాడికి కంటకప్రాయంగా తయారవుతూంది !"

"అయితే చావనా !"

"చచ్చినా మచ్చ మచ్చే !"

అనంతంగా సాగిపోయే ఆలోచనలు వో కొలిక్కి రావడంలేదు ఎంత ఆలోచించినా ?

"చెప్పమ్మా నే నడిగినదానికి సమాధానం చెప్పు."

"ఇప్పుడెందుకులే నాయనా ఇదంతా ? పెద్దవాడవైతే తెలుసు కొందువులే ! "

నోట్లో మాట నోట్లో ఉండగానే ఆమె గబగబ వెళ్లిపోయింది. మారు మాట్లాడకుండా అక్కడి నుంది కదిలాడు ముత్యాలు. బరువెక్కిన గుండెను మోయలేక మోస్తున్నాయి అడుగులు. వెళ్లి పడుకొన్నాడే కాని నిద్రపట్టలేదు.

"అసలు అమ్మ తప్పుచేయకుంటే ఎందుకిలా కప్పిపుచ్చుతుంది

తండ్రిని తెలుసుకొనే హక్కు — పోనీ అదృష్టం బిడ్డకు లేదా? 'నీకెందుకిదంతా అంటుందే!' — పోనీ, అమ్మకు నా దగ్గర దాపరిక మెందుకు? ఇదే నిజమైతే ఉదయాన వూళ్లోవాళ్ల మొగమెలా చూడాలి?"

ఆలోచించేకొద్దీ హృదయం కుతకుత ఉడికిపోతూంది. చూరుకప్పు బొరియలగుండా తొంగిచూస్తూ చందమామ "పిచ్చివాన్నా! పడుకొని నిద్రపోరా!" అని హెచ్చరిస్తున్నాడు. ఎక్కడో నక్కల అరపులు జొన్న చేనులవద్ద కాపలికాస్తున్నవాళ్ల అదలింపులు పూరింటి అరుగుమీద పడుకొని ఉన్న వో స్త్రీ మూలుగులు అర్ధరాత్రి సమయంలో అదో విధమైన రొద ప్రకృతి పసిపిల్లల పల్లెకూటంలా ఉంది. మరునాటి ఉదయాన్ని వూహించుకొని ముత్యాలు తుంగ చాపమీద గడగడలాడిపోతున్నాడు. తెట్టె మీద తేనెటీగల్లా ముసిరిన ఆలోచనలు ఆగని కాలం అర్ధరాత్రికి పైగా దాటినట్లుంది. పూరింట్లో ఏదో కదిలిన శబ్దం- పిల్లిలా అడుగులు వేస్తూ నీడలా నడిచింది వో ఆకారం. వో క్షణం నిలబడి వెనక్కి తిరిగి చూచింది. తొమ్మిది నెలలు మోసి యాతన తనలో ప్రసవించి, పది సంవత్సరాలు పోషించిన అమ్మ! - పైట చెరుగు పాన్పుగా కటికనేల తల్పంగా అరుగుమీద అస్తవ్యస్తంగా పడి నిద్రపోతూంది. లెక్కలేనన్ని ఆలోచనల ఫలితంగా రూపొందిన ఏదో సంకల్పంతో ఘనీభవించిన హృదయం, ద్రవిస్తే కండ్లు వాగులైనాయి. ఆ వాగుల్లో ఉవ్వెత్తుగా లేచిన సుడిగుండంలా వెలువడిన 'అమ్మా!' అన్న ఆర్తనాదాన్ని పెదవులు నొక్కిపట్టితే, ఒక్క అడుగు ముందుకు వేయలేక పోయాడు ముత్యాలు ఆ దృశ్యాన్ని చూచి. ఊళ్లోవాళ్లంతా అమ్మ ముందు నిలబడి వికటంగా నవ్వుతూ, తనవైపు అదోవిధంగా చూస్తూ, చెవులు కొరుక్కుంటున్నారు. ఒక ప్రక్క పౌరుషము, ఒక ప్రక్క అవమానము, తన్ను సమస్థాయిలో లాగుతుంటే, చూస్తూ సహించలేక, అటువైపు చూడలేక మొగాన్ని రెండు చేతులతో కప్పుకొని వెనక్కు తిరిగాడు. ఆ నిశీధినిలో ఎక్కడికో, ఎందుకో, గమ్యం తెలియని గమ్యానికి బయలుదేరాడు. ఏ రమ్యాతి రమ్యమైన ఆకర్షణలు అక్కడ ఉన్నాయో మరి?

ఆమీదట తన జీవిత గుడారాన్ని తిండి దొరకని చోటునుండి, కొత్త తిండి దొరికే చోటుకు రవాణాచేస్తూ అక్కడ తిండికి బదులు తిట్లు తింటూ, ఏ చెట్టునీడనో తలదాచుకొంటూ, మరో ఏనిమిది సంవత్సరాలు నెట్టాడు. ఆ రవాణాలో వోసారి రైలు ప్రయాణం తటస్థించింది. పడిరేయి త్రిక్కిరి

సిన మూడవ తరగతి రైలుపెట్టె ఎక్కడివా రక్కడ నిద్రమత్తులో వూగిస లాడుతున్నారు. వాకిలి వద్ద కాస్త చోటుచేసుకొని నిలబడి ఉన్నాడు. కాళ్లు పీకుతూ, కళ్ల మూతలు పడుతున్నాయి. చాల దగ్గరలో 'గుర్ గుర్' మన్న శబ్దం వినిపించింది. అటువైపు చూశాడు. అంత అవస్థలో కూడ చూస్తుంటే తనకు నవ్వు పుట్టుకువచ్చింది. వో లావుపాటి ఆసామి దానికి మించిన లావు పాటి వ్యాపారం లేదన్నట్లుగ పెట్టె తలగడగా, సామానులుంచే అటక పడకగా అమరిఉంటే, గుర్రు పెట్టి నిద్రపోతున్నాడు. ఆ కొద్దిపాటి సౌభాగ్యానికి మానవుడు పడే యాతనను గమనిస్తూ నిలబడ్డాడు ముత్యాలు. అంతలోనే ఏవో స్టేషను రావడం, బండి ఆగి కదలడం, మంచి వేగాన్ని లంఘించుకొనడం జరిగింది. ఆ కుదుపుల్లో అతడు ప్రక్కకు వత్తిగిలి, చేతిని తలగడగా సర్దు కొన్నాడు. రైలు యథావిధంగా నడుస్తూంది మహా మేరువులా పేరుకుపోయిన చీకటిని చీల్చుకొంటూ. చోటు దొరికిన వారు 'సౌఖ్యమంతా మాదే!' అన్నట్లు కాళ్లు విగడదన్ని ఒదిగి నిలబడ్డవాళ్ల కూర్చున్నవాళ్ల మీద ఆలిగి, 'మానవత్వము, కరుణ, సర్దుబాటు' లాంటి పదజాలాన్ని చక్కటి వాక్యాలలో పొదిగి అందిస్తు న్నారు. కొందరు ప్రభుత్వ నిందాస్తుతిలో పడ్డారు. 'దేనితో నాకు నిమిత్తం లేదు గమ్యం నా లక్ష్యం!'అని పరుగులుతీసే రైలు ఎల్లా ఆగింది.

అదొక చిన్న రైల్వేస్టేషన్. ఆ ప్రదేశమంతా చీకటి ఒడిలో ప్రశాం తంగా ఉంటే, ప్లాట్‌ఫారం కొసల్లో పోర్టరు పొదుపు ఉద్యమంలో ఇరుక్కొని కొనవూపిరితో ఉన్న రెండు కిరసనాయిలు దీపాలు, శాంతిభంగం చేస్తూంనేమో అల్లాడిపోతున్నాయి. కాస్త చోటు దొరికితే చాలు కాసేపు నడుం వాల్చవచ్చు నన్న సదుద్దేశంలో నేమో, దిగేవాళ్లను కూడా దిగనీయకుండా ఎగబడుతున్నారు ప్రయాణీకులు ఉడ్డకు ముగ్గురు తక్కువైతే కూడా. ఆ బండి రాకకోసమే వో నిర్ణీత వేషంలో తయారైన స్టేషనుమాస్టరు పుట్టి మునిగినట్లు అటు, ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు ఉపరిణామాన్నంతటినీ అధిగమిస్తూ "అయ్యో! నా పెట్టె! నా పెట్టె!!" అన్న అరుపులు వినబడేసరి అందరూ అటువైపు చూశారు పాపం! అటకమీద నిద్రమత్తులో గురకపెడుతూ ఉండిన ఆసామి, పెట్టెకోసం దేవులాడుతూ, దిగనుంకిస్తూ దిగలేక తంటాలు పడుతు న్నాడు. ఇంతవరకు పెట్టె అతనికి తలగడగా ఉండడం అంత నిద్రలో కూడ అతడు అప్పుడప్పుడు పెట్టె ఉందో లేదో అని తడిమి చూసుకోవడం-గమని స్తూనే ఉన్నాడు ముత్యాలు. అంతలోపలే మాయమయింది. 'ఆశ్చర్యంగా

ఉందే!' అనుకొని ప్లాట్‌ఫారం వైపు చూశాడు. అంతవరకు తన ప్రక్కనే నిలబడి ఉండిన ఓ 'సూటు' మహాశయుడు చకచక నడిచివెళ్ళుతున్నాడు ప్లాట్‌ఫారం మీద! చేతిలో పెట్టె ఉంది. ఆ పెట్టెవైపు దీక్షగా చూశాడు. సందేహమేమీ లేదు. నిజంగా ఆ పెట్టె ఈ లావుపాటి ఆసామిదే!_ అంతే 'దొంగ! దొంగ!!' అని అరుస్తూ ఎగిరి ప్లాట్‌ఫారం మీద దూకి ఆ 'సూటువాలా'ను వెంబడించాడు. 'దొంగ' అన్నమాట చెవినిపడటంతో అందరూ 'దొంగ! దొంగ!!' అని ముక్తకంఠంతో అరిచారు. ఎవరు దొంగో! ఎక్కడి దొంగో! అర్థంకాకపోయినా, తాము చూడకపోయినా.

స్టేషన్‌మాస్టర్ ఎఱ్ఱదీపం చూపాడు. ముందుకు ముందుకు పోయలేదు రైలుబండి ఆ పెట్టెలో ఓ ఆరేడుగురు వీరి ముందువైపు పరుగెత్తారు. స్టేషన్ మాస్టరు, గార్డు కూడ పరుగెడుతున్నారు దొంగకోసం గాదు_ పోలీసుల కోసం! మొదటి తరగతిలోనైనా మెత్తని పరుపులమీద గాఢనిద్రలో మునిగిన పోలీసు ఒళ్ళు విరుచుకుంటూ, ఈ ఆర్భాటాలకు విసుక్కొంటూ పైకిలేచాడు. అనుకోని ఈ పరిణామంతో, పెట్టెను వదిలిపెట్టి, చీకటిలో కలిసిపోయాడు సూటువాలా. 'పోతే పొయ్యాడు వెధవ! సొత్తు దక్కింది!' అని పెట్టెను చేతి కందుకొన్నాడు. అంతే! పెట్టె చేతికి వచ్చిందో, లేదో నాలుగు చేతులు కలిసి తనను పరామర్శిస్తే, ఆ గుంపును చీల్చుకొని వచ్చిన పోలీసు అకారం బాగా సత్కరించింది.

మాసిన గుడ్డలు పెరిగిన గడ్డం సంస్కారాన్ని చవిచూడని జుట్టూ, ప్లాట్‌ఫారంమీద ఎగిరి దూకి పరుగెడుతూంటే ఎక్కడిదో జారిపోయిన టిక్కెట్టూ, తన సహృదయత చుట్టూ దిట్టంగా గోడలు కట్టాయి. తత్ఫలితంగా నాలుగేళ్లు జైలు కమ్ములు లెక్కపెట్టాడు గోళ్లు గిల్లుకొంటూ! అదీ ఎలా? అటూ ఇటూ కాదు ఏ వైపునుండి ఏ కమ్మీని చూసినా దాని నంబరు కచ్చితంగా చెప్పగల సామర్థ్యం అలవడేవరకూ లెక్కపెట్టాడు. ఈ సామర్థ్యాన్ని గుర్తించిని జైలు అధికార్లు అతనిని వదిలిపెట్టారు ఇక బ్రతకగలడన్న ధీమాతోనేమో!

ముత్యాలు బయటపడ్డాడు కాదు_ జగన్నాటక సూత్రధారి అలా బయటపెట్టాడు. నాలుగు గోడల మధ్య కూర్చుని, అమాయకుడు ఏమేమో వూహించుకొన్నాడు కానీ, ఇక్కడ ఒకటీ తన వూహ కందలేదు. వూహ కందింది అర్థంకావడంలేదు. ఏమిటో మరి?_ రైళ్లు పరుగెడుతూనే ఉన్నాయి.

మోటార్లు, కార్లు, లారీలు, పంతం వదలడం లేదు. కొనడం, తినడం, లేకపోతే పెడపటంతో మానవులు పోటీ పడుతూనే ఉన్నారు. అన్నిటినీ మించి ప్రొద్దు పొట్టుతూ ఉంది పోతూ ఉంది. ఏమిటో గమ్యం? ఇలాంటి స్థితిలో తనలాంటి వాళ్ళ న గురించి ఆలోచించడానికీ, కన్నీళ్లు కార్చకపోయినా కనీసం కాస్త సానుభూతినైనా ప్రకటించడానికి ఎవరికీ అవకాశం ఉంటుంది తన పిచ్చి కానీ.

ఆ సంకలో తన స్వాతంత్ర్య విశ్వాసాన్ని గురించి జాగ్రత్తపు ఆలోచించవలసి వస్తే, తన చిన్ననాటి విషయం ఒకటి గుర్తుకువచ్చింది. తన పూరింటి నట్టింటు గూట్లో వో బుడిగ హుండీ ఉండేది. పావలా కూలిడబ్బుల్లో వో కానీ మిగిల్చి అందులో వేస్తూ శనివారంపూట ఉపవాసముండి ఆ హుండీని పూజిం చేది అమ్మ! "ఇదేవిటమ్మా?" అని అడిగితే "ఏడుకొండలవాని ముడుపు నాయనా!" అంటూ ఉత్తరంగా మళ్ళీ రెండు చేతులు జోడించేది. అలాంటి దేవుణ్ణి తాను ఇంతవరకు చూడలేదు. తలంపు కలిగిందే తడవుగా నడక సాగిం చాడు. కాస్త వోపిక పట్టితే వోపూట తిండి తిప్పలను, మరి కొంచెం వోపిక ఉంటే వో రెండు మూడు రాత్రులు నిద్రను, అలను జయిస్తే ఈ ప్రపంచంలో సంబంధాన్ని వదులుకోవచ్చునేమో కానీ, ఎంత నిబ్బరమున్నా ఈ ఆలోచన లను అవతలికి నెట్టడం అసాధ్యమనిపిస్తుంది. కీకారణ్యంలో దట్టమైన పొదల్లా ఎదురయ్యే ఆలోచనలను అతి ప్రయత్నంతో తప్పుకొంటూ, ముందుకు సాగి పోతున్నాడు ముత్యాలు!

మిట్టమధ్యాహ్నం. నడిమిట్టన నీలుగుతూండిన సూర్యుడు కాస్త పడమటి ప్రక్కకి వాలి మబ్బుల మాటున మినకరిస్తున్నాడు. బాట ప్రక్కనే వూడలు దిగిన మర్రిచెట్టు బాటసారుల వరప్రసాదివిలా ఉంది. ఆ చెట్టుక్రింద కూర్చు న్నాడు ముత్యాలు. కాళ్లు కుక్కలు పీకినట్లు లాగుతున్నాయి కడుపు మండి పోతూ ఉంది. చేతిలో చిల్లిగవ్వ లేదు. భవితవ్యం దుర్గమంగా తోస్తే, ఏమి చేయనూ తోచకుండా, ఆ చెట్టువంక పరిశీలనగా చూస్తున్నాడు. కనువిప్పి విప్పని 'కార్ కార్' మంటున్న గువ్వపిల్లలు చిదుగుబొదుగు గూటిలో తల్లిగువ్వ మేత ముక్కున కుడిస్తూ ఉంటే, రెక్కలు కొడుతున్నాయి. గూటి నిర్మాణం కోసం యాతనపడుతున్న సాలెపురుగును పిమగితే కబళిద్దామని పొంచిఉంది ఒక బల్లి. రెండు గువ్వలు ఆకుల మాటున వో రెమ్మమీద కూర్చుని మూగ భావాల ముద్రలో మురిసిపోతున్నాయి. గోలకు మారుపేరు కాకులు కూడా నిందను మాపుకోవాలనేమో గట్టున కూర్చున్నాయి. అనంత విశ్వాన్నే జ్ఞప్తికి తెస్తూ

ఉంది ఆ మర్రిచెట్టు. అన్ని జీవరాసులకు ఆయువుపట్టు!— ఆ జీవరాసులపై ఆ మర్రిచెట్టుకున్న మమత మానవాళిలో ఉంటే !

ఇక ఆలోచించలేకపోయాడు ముత్యాలు. దృష్టి మరోవైపు మళ్ళింది. ఇంకనూ దాదాపు మైలు దూరమున్నట్లుంది తిరుపతి. అతి సమీపంలో విశ్వవిద్యాలయ భవనాలు సర్వశోభాయమానంగా ఉన్నాయి. మధ్యాహ్న భోజనానంతరమేమో కళాశాలల్లో చదివే అమ్మాయిలంతా చకచక నడిచిపోతుంటే, సందెడు పుస్తకాల బరువుతో సన్నని నడుములంతా ఒగిరిస్తున్నాయి. వాళ్లను చూస్తుంటే ముత్యాలు కళ్లు చెమ్మగిల్లాయి. అవును! తన చదువు సరిగ్గా సాగి ఉంటే, తాను కూడా ఈవరకు ఇలా కళాశాలలో చదువుతూ ఉండవలసింది. ఇంకనూ చదువడమేమిటి? ముప్ఫైయేళ్లు నెత్తిమీద సవారిచేస్తుంటే, ఈపాటికి ఏదైనా ఉద్యోగం చేస్తూ అమ్మను పోషిస్తూ ఉండేవాడు. అమ్మ! ఏమైపోయిందో, ఏమో? తనలాంటి వో నిర్భాగ్యుణ్ణి కని, గాలికి వదలి, తాను కదిలీ మెదలకుండా కూర్చుని ఉంటుంది. తాను సమాజపు కట్టుబాట్లు త్రెంచుకొని తనకు వో కట్టుబాటు లేకుండా చేసిందీ లోకంలో! నలుగురి నోళ్ళల్లో నానేటట్లు చేసింది! ఆమెను గురించి ఆలోచించడం కూడా !

కామెర్లకంటి వానికి ప్రపంచమంతా పచ్చగా గోచరించినట్లు, పిరికివాని కంటికి లోకమంతా అనుమానాస్పదంగా గోచరిస్తుంది. "నీది తప్పుడు పుట్టుక! ఈ సంఘంలో నీకు తావులేదు," అని వేలెత్తి చూపించే ఓ అనుమాన భూతం ఆవరిస్తే ఆ మర్రిచెట్టు బోదెకు ఆనుకొని పరధ్యానాన్ని పరామర్శిస్తున్న ముత్యాలు 'కెవ్వు' మన్న కేకతో ఎగిరిపడ్డాడు. పాపం! గడగడలాడుతూ తన మెడకు బల్లిలా హత్తుకపోయింది ఆ కసుగందు. ఒక్క 'సడన్ బ్రేక్'తో లారీని నిలబెట్టిన డ్రైవరు 'హమ్మయ్య!' అని నిట్టూర్చి, పట్టిన చెమటను కాస్త తుడుచుకొని తమాయించుకొని ముందుకు సాగిపోయాడు. ముత్యాలు పాపను మరలా మర్రిచెట్టు క్రిందకి మోసుకొని వచ్చాడు. క్రింద దింపాడు. చెట్టులోనే రంగు తిరిగిన నిమ్మపండులాంటి పసిమిఛాయ. నాలుగైదు సంవత్సరాల వయస్సు ఉంటుందేమో. ముద్దులమూట కట్టినట్లుంది పాప. చెవిలో లోలకులు. మెడలో గొలుసు, మంచిదుస్తులు, కలిగినయింటి బిడ్డగానే కనిపిస్తూ ఉంది. దడ తీరలేదేమో! ఇంకనూ వణికిపోతూనే ఉంది

"నీ పేరేమిటమ్మా?" గోముగా బుజ్జగిస్తూ అడిగాడు ముత్యాలు.

"లమ" మురిపాల మూటలోనుండి ఓ ముద్దు—కాదు ఓమాట జారిపడితే ముత్యాల హృదయం ఆనందాన్ని వాటు(దోచు)కొనింది.

"మీ యిల్లెక్కడమ్మా?"

చేయెత్తి చూపింది పాప। అటువైపు చూశాడు. బాటకు దక్షిణంగా, కవలపిల్లల్లా ఓ రంగుతో ఒకటి చూసినట్లు మరొకటిగా ఓ అయిదారు మేడ లున్నాయి. ప్రతి ఇంటిచుట్టూ ప్రహరీగోడ. ఆ గోడ లోపల తోట మధ్యగా మేడ, ఊహను దృఢపరచుకొన్నాడు ముత్యాలు.


"...అయితే ఈ ఎండలో ఎందుకిలా వచ్చావమ్మా?"

"ఆలుకోటానికి।" ఆస్సంకోచంగా సమాధానం చెప్పింది రమ.

"ఇంటిముందరో, లేదు, ఈ చెట్ల క్రిందనో ఆడుకోకుండా బాట కొప్రక్క కెందు కెళ్ళావమ్మా? ఎప్పుడూ బస్సులు, లారీలు, కార్లు పరుగెత్తు తుంటాయే!" మెల్లగా మందలించాడు ముత్యాలు.

"నా బంతి పోయింది। బంతికోసం నేనెళ్లాను।" చేతిలోని బంతివైపు అదోలా తాను చూసుకొంటూ, తనకు చూపింది రమ.

పాప తెలివికి పూబంతి అయ్యింది ముత్యాలు హృదయం. తనివిదీర ఒక్క ముద్దు పెట్టుకోవాలని హృదయం తహతహలాడింది. ఆ వాంఛతోపాటు బాల్యస్మృతులుకూడ లీలగా మనస్సులో మెదిలాయి. అవును. ఎప్పుడైనా, ఏదైనా అమ్మ అడిగినదానికి తడుముకోకుండా చిలిపిగా బదులుపలికితే ఆమె హృదయం కొండంత అయ్యేది. గుండెల కదుముకొని, "ఎంత తెలివమ్మా నా దొర। ఏడూళ్ళు ఏలితీరుతాడు!" అంటూ సంతృప్తిగ నిట్టూర్చేది. మాటల్లో కోరికలు మాటలుగానే నిలబడితే, ఆ నిట్టూర్పుల్లో బాధలు మాత్రం తన్ను వదలిపెట్టడం లేదు. ఇల్లు వదలింది మొదలు ఈనాటివరకు ఇలాంటి ఘటన కానీ, ఆలోచించే అస్కారం కానీ కలుగలేదు. ఈనాడు తన హృదయం ప్రేమతో తొణికిస లాడుతూ ఉంది। అందుకేనేమో రెండు చేతులతో ఆ అమ్మాయిని పొదివి పట్టుకొని అక్కున చేర్చుకోబోయాడు. మాసిన గుడ్డలు, గిజిగాని గూడులాంటి గడ్డము, నెత్తిన మంతడు నీళ్ళుచల్లుకొని ఎన్నాళ్ళయిందో, అదో విధమైన వాసన, పాపం! రమకు తగని అసహ్యమయిందో। ఆ ఆకారానికి జడుసుకొనిందో— లేక సహజ మైన సిగ్గు పొటమరించిందో, తెలియదు కానీ, పట్టు తప్పించుకోవాలని విలవిల కొట్టుకొంటూ ఉంది. ముత్యాలు అదేమి గమనించే స్థితిలో లేడు. అంతలోనే తన చెంప 'ఛెళ్ళు' మనింది. ఆ దెబ్బతో పట్టువదలి పైకిలేచి నిలబడ్డాడు. చెంప




మీద చేతివ్రేళ్ళ గుర్తులను మాసినగడ్డం మూసిపెట్టినా, కెంపు తిరిగిన కనుగ్రుడ్లు మాత్రం కన్నీళ్ళను కప్పిపుచ్చలేకపోయాయి: ఆణిముత్యాల్లా టపటప నేలరాలి, ఇంకిపోయాయి. అది వాటి లక్షణం కాబట్టి.

"ఎవడివిరా నువ్వు ఒంటరిపాటున చేతికి చిక్కిందని గొంతుపిసికి పారేద్దామనుకున్నావా? ఉండు నిన్ను పోలీసుల కప్పచెప్పుతాను."—అంటూ పొగలు గక్కుతున్నాడు రమతండ్రి నీలమేఘం

"అదేనండీ! నేను చెబితే మీరేమో పట్టించుకోకపోతిరి. పాప అరిచి నట్లుంది చూడండి... అంటె పసిపిల్లలతో కలిసి గోలచేస్తూ ఉంటుందంటిరి. ఇప్పుడే కనక రాకపోతే పాపని ఏమైఉండేది? అయ్యో నా చిట్టితల్లి!" అని వాపోతూ ఉంది రమతల్లి లీలావతమ్మ.

అంత దుస్థితిలో కూడా ఆ ఇరువురుని ఒక్కసారి పరీక్షగా చూచి ఓ చిరునవ్వు నవ్వాడు ముత్యాలు!

" పైగా నవ్వుతావటరా నువ్వు? నేనెవడననుకొన్నావో ఏమో? అనుకొంటే నిన్ను నిముషాలమీద అరెస్టు చేయించగలను." గుడ్లురుముతున్నాడు నీలమేఘం.

వింతగా అతనివైపు చూస్తున్నాడు ముత్యాలు. ఇదంతా ఏమీ అర్థం చేసుకోలేని రమ మాత్రం తల్లికాళ్ళు పొదవిపట్టుకొని బిక్కచూపులు చూస్తూ ఉంది. ఏమో చెప్పాలని ఆరాటపడే ఆ పసిహృదయం, తండ్రి ఉధృతాన్ని

చూచి అసలే మరచిపోయింది.

"ఎవడో పిచ్చివెధవ లాగున్నాడు. వాడితో ఎందుకు పోనీలెండి!" అంటూ రమను చంకన వేసుకొని వెళ్ళిపోయింది లీలావతమ్మ. మళ్ళీ ఒక్కసారి నవ్వాడు ముత్యాలు.

"అయ్యో! పిచ్చితండ్రి!! పోలీసులు, జైళ్ళు నాకేమీ కొత్తగాదు. మీరను కొన్నంత పనిచేయడానికి కూడా సమర్థులే. అయితే నేను నవ్వడమంతా నా అదృష్టాన్ని తలంచుకొని!" అన్నట్లుంది ఆ నవ్వు. ఆ నవ్వుల్లో మరీ రెచ్చిపోయాడు నీలమేఘం.

"ఏరా! నీకంతా నవ్వులాటగాఉంది కదూ ?!.... అయితే ఉండు!" అంటూ ఒక్క ఊపులో ఇంటివైపు వెళ్ళాడు నీలమేఘం.

ఇక్కడ ముత్యాలు తనను గురించి, అపైన భగవంతుని అస్తిత్వాన్ని గురించి కాసేపు ఆలోచించవలసి వచ్చింది. ఏమిటో తన బ్రతుకు తనకే అర్థం కావడం లేదు. పుణ్యానికి పోతే పాపమెదురవుతూ వుంది. పాపం.... ఎప్పుడో, ఎక్కడో, అనుభవించవలసిన కష్టాలకు చక్కని నామకరణం. ఇక్కడే, ఇప్పుడే తనని ఓరాగాన వదలిపెట్టడం లేదు. మొలలోతు నీళ్ళల్లో తల మునిగేవరకు ముంచి, ఊపిరాడకుండ చేసి తీరా ఆ కాస్త ఊపిరిపోబోయే సరికి 'పోనీలే'! అని దయదలచి వదలిపెడుతూ ఉంది. తాను చేసిన తప్పేమి? తనను, తన పుట్టుకను హేయభావంతో అవహేళనచేసే వాతావరణాన్ని వదలి రావడం తప్పా? కండ్ల ముందు జరిగే అన్యాయాలకు అడ్డుతగలడం తప్పా? లేదు. సాంఘిక నీతినియమాలకు ప్రేమించడం తప్పా? అనుభవం సముపార్జించిన తెలివితో ముత్యాలు ఆలోచనా పరంపర ఓ స్థాయిలో సాగిపోతూ ఉంది. ఆలోచనతో పోటీపడ్డ ముత్యాలు, నీలమేఘాన్ని, ఆయన పంతాన్ని పూర్తిగా విస్మరించాడు.

"ఓ!.... వీడా ?" మాట, మాటవెంబడి నవ్వు, ఒకదాని నొకటి తరుముతున్నట్లుగ పూడిపడ్డాయి ఉన్నట్టుండి. ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు ముత్యాలు. ఎదురుగ పోలీసు ఆఫీసరు తనివితీర నవ్వుతున్నాడు. ఆ నవ్వులో పరిచయస్తుణ్ణి గుర్తించిన పట్టు, పోలీసుఆఫీసరు బెట్టు నిండుగ ఉన్నాయి. నీలమేఘం దర్పంగా చూస్తున్నాడు. 'చూశావా నా దెబ్బ?' అన్నట్లున్నాయి ఆ చూపులు. 'వదిలితే చాలు!' అని వేటకుక్కల్లా వేచి ఉన్నారు పోలీసులు.

ఒకసారి చేతిలో డైరీవైపు, మరొక్కసారి ముత్యాలువైపు చూశాడు

పోలీసు ఆఫీసరు సందేహ నివృత్తి కోసం. సందేహానికి తావులేకపోతే, విచారణకు అవసరమే లేకపోయింది. 'ఫూ!'- అన్నాడు పోలీసు దొర. ముందు వెనకాడకుండా ముంజేతులకు కంకణాలు తొడిగారు ముత్యాలుకు పోలీసులు. తమ పాత చుట్టాన్ని గుర్తించడంలో వాళ్ళేమీ పొరపాటు పడలేదు. తత్ఫలితంగా "అత్తగారింటి ఆదరణ" ద్విగుణీకృతమై ఆరేళ్ళు అతనిని వదలిపెట్టలేదు!....

ఆరేళ్ళ తర్వాత మళ్ళీ బయటపడ్డాడు. బయటపడిందే తడవుగ నడుస్తున్నాడు. ఎటుపడితే అటుగాకుండా దారి వెళ్ళినట్లు తాను వెళ్ళుతున్నాడు. ఆ నడకలో ఏదో నిర్ణయం, ఆ ఆకారంలో ఏదో ఆక్రందనం, ఆ చూపుల్లో ఏదో అన్వేషణ. ఏమిటో అతని గమ్యం?

ముత్యాలు తన నడక మానలేదు. అయితే మాత్రం ఎంతకాలమని అలా కాలంతో పోటీపడ గలుగుతాడు? పరిస్థితి అనుకూలించినంతవరకూ మానమన్నా మానలేదు. కానీ, ఆపైన మాత్రం ఆగక తప్పదు.

ఓ పల్లె ముందు చెట్టుక్రింద కూర్చున్నాడు ముత్యాలు. ప్రొద్దు గూట్లో పడుతూ పడుతూ ఉంది. మేతకోసం రెక్కలొడ్డి ఎగిరి, దేశమంతా గాలించి, పొట్ట నింపుకొన్న పక్షులు గూళ్ళు చేరడానికి గుంపులు గుంపులుగా వస్తున్నాయి. అడవికి మేత కేగిన ఆలమందలు ఇంటిముఖంపట్టి, గేవిన్లో ఎదురుపడ్డ లేగ దూడలను ఎదకు హత్తుకోలేకపోయినా శరీరమంతా నాకుతున్నాయి ఆప్యాయంగా. పొలంనుండి అరమూట ధాన్యాన్ని మోయలేక మోసుకొస్తున్న మగనికి ఎదురైన మగువ, ఆ మూటనందుకొంటూ, [illegible] మెడ విరుచుకొంటూ, కొంటెచూపులు చూస్తున్నాది. ఆ చెట్టుక్రిందనే కంసాలి కొట్టు. [illegible] కొలిమిలో బూడిదనంతా తీసి ఆ ప్రక్కనే కుప్పగా పోశాడు. ఆ బూడిదలో పడుకొంది వో కుక్క. [illegible] నాలుగైదు [illegible]పిల్లలు పాలు త్రాగుకొంటుంటే ఎంతో ఆప్యాయంగా పిల్లలవైపు చూస్తూ మైమరచి పడుకుంది ఆ కుక్క. అన్నిటినీ పరీక్షగా చూశాడు ముత్యాలు. కాలచక్ర గమనంలో ఇలాంటి సంఘటనలు తన కంటపడకుండా ఉండడానికి, నాలుగు గోడల మధ్య కట్టుదిట్టాలతో పెంచబడిన బుద్ధుడు కాదు తానేమీ! అయితే ఏనాడూ ఇలాంటి అనుభూతి మాత్రం అతనికి కల్గలేదు. అదేమి చిత్రమో సృష్టి అంతా ప్రేమమయంగా గోచరిస్తోంది. కాగా అతని వదనం ప్రసన్నతతో తొణికిసలాడింది. లేని ఉత్సాహం నరాలమీద పనిచేస్తే మళ్ళీ మెల్లగా ముందుకు సాగాడు; బహుశా ఇంత కరుణామయమైన ప్రపంచంలో కాస్త చోటు సహృదయతకు కాస్త సానుభూతి లభించకపోదులే అన్న ఆశలతోనేమో!

ఆ ఆశతోనే మూడామడలు కాళ్లీడ్చుకొంటూ వచ్చి కూలబడ్డాడు ఆ వెలగచెట్టు క్రింద, గుంటలో గుక్కెడు నీళ్ళు త్రాగి అక్కడ తన కథ ఉంది ఆ పదేళ్ల కుర్రవాడు. వాణ్ణి చూస్తుంటే గుండెలు తరుక్కుపోతున్నాయి. తనను గురించి ఆలోచించేవాళ్ళు లేక తన్నుకు చస్తుంటే తాను ఇంకొకరిని గురించి ఆలోచిస్తున్నాడు; తన్ను మాలిన ధర్మంలా.

పాపం! వాడూ తనలాగే వీధులపాలై ఉంటాడు. కంటికి సన్నగా కనిపించిన వారినంతా, "చదువుకోవాలి, తల్లిదండ్రి ఎవ్వరూ లేరు. సాయం చేయండి" అని ప్రతిమాలి ఉంటాడు. అది ఫలించకపోగా, పనికోసం ప్రాధేయపడి ఉంటాడు. "వూరూ పేరూ లేని వెధవలకు పనెవరిస్తారు? పోరా!!" అని కసరికొడితే తిట్లకు, చీవాట్లకు అలవాటుపడి కడకు అడుక్కు తినడానికి తయారయి ఉంటాడు. నాలాంటి ఇలాంటి దౌర్భాగ్యులెందరున్నారో ఈ లోకంలో? అబ్బ! ఎంత విషాదం గూడుకట్టుకొని ఉంది ఆ కళ్ళల్లో! ఎన్ని కన్నీళ్ళు నిట్టూర్పు సెగలతో ఆవిరై పోయాయో ఆ చెక్కిళ్ళపై!...."

దారిన పోతూండిన ఆ పదేళ్ళ పిల్లవానిని గురించిన ఆలోచనా స్రవంతి గుండెలో పొంగి తన జీవితంతో వో సమన్వయాన్ని కుదుర్చుకొనేసరికి ఏదో అజ్ఞాతావ్యక్తమైన సానుభూతి ఆ కుర్రవాని భవిష్యత్తుపై విపులమైన ప్రీతి తనను వీపుతట్టి పైకిలేపాయి. పైకి లేవబోయాడు ఎంతో ప్రయాసతో. మూన్నాళ్ళుగా వట్టి కడుపు పైన కాసిన్ని మంచినీళ్లు పడడం పైత్యం ప్రకోపించిందేమో, ఎవరిమాటలో అలా ఉంది శరీరం తన మాటలనే లెక్కచేయడంలేదు. కళ్లు తిరుగుతున్నాయి. కాళ్లు తడబడుతున్నాయి. ఎట్లో నిబ్బరించుకొని 'బాబూ!' అంటూ ఒక్క అడుగు ముందుకు వేయబోయాడు. అంతే......

ఎక్కడో అత్తగారి పోటుకుతో అల్లాడిపోయే ఓ మహాసాధ్వి తెగించి పిడికెడు మెతుకులు దోసెటతో తెచ్చి విదిలిస్తే సంతృప్తిగా నవ్వుకొన్నాడు ఆ పదేళ్ళ కుర్రవాడు.

ఒక్క అడుగు ముందుకు వేయలేని నిస్సహస్థితిలో కుప్పగ కూలబడ్డాడు ముత్యాలు. కాలచక్రం ఒడిదుడుకులో చిక్కుకొని, ధక్కాముక్కీలు తిన్న తనువులాంటి ఎముకలగూడు నేలకు అతుక్కుపోయినా, గూట్లో నిశ్చలంగా వెలిగే దివ్వెల్లా సునిశితమైన దృక్కులు మాత్రం దేవులాడుతూనే ఉన్నాయి దేనికోసమో? ఎమనుకొనిందో ఏమో?.... లోకం నవ్వింది! దాని తీరే అంత మరి!!